క్లుప్తంగా

వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ



పగిడిరాయిలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎంపీపీ, సర్పంచ్

తుగ్గలి: మండల పరిధిలోని పగిడిరాయిలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పురోహితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నూతనంగా నిర్మించిన ఆలయంలో వాల్మీకి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామ పెద్దలు జగన్నాథరెడ్డి, ఈశ్వరరెడ్డి, బసిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ ఆదెమ్మ రంగన్న దంపతులు, సర్పంచ్ బోడబండ సౌజన్య, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ గుంత దేవి, వాల్మీకులు పూజల్లో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

ఆలూరు రూరల్: 5–18 ఏళ్ల లోపు వయసున్న పిల్లలు, మధ్యలో చదువు ఆపేసిన పిల్లలను బడిలో చేర్పించాలని ఎంపీడీఓ అల్లబకాష్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ మీటింగ్ హాల్‌లో విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బడిఈడుకు వచ్చిన పిల్లలు, మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులు ఎంత మంది ఉన్నారో సర్వే చేసి వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. జూన్ 11వ తేదీలోగా అన్ని గ్రామాల్లో ఉన్న పిల్లలు, విద్యార్థుల సంఖ్య ఈ నెలాఖరులోగా అందించాలన్నారు.వలంటీర్లు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలన్నారు. ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

సద్వినియోగం చేసుకోండి

మద్దికెర: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఫెయిలైన విద్యార్థుల కోసం స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సవిత సూచించారు. ఆమె బుధవారం మాట్లాడుతూ.. విద్యార్థులు సప్లిమెంటరీలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. విద్యార్థులకు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్నారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రత్యేక తరగతులకు పంపాలని కోరారు.

కూలీల హాజరు తప్పనిసరి



మస్టర్లను పరిశీలిస్తున్న ఏపీఓ రవీంద్రనాథ్

మద్దికెర: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలు తప్పనిసరిగా హాజరు నమోదు చేయాలని ఏపీ ఓ రవీంద్రనాథ్ సూచించారు. బుధవారం మద్దికెర పరిసరాలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం పనులు చేస్తే రోజువారికూలీ రూ.272 వస్తుందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు రైతులకు కావలసిన పనులు గుర్తించి పూర్తి చేయించేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ వెంట ఉన్నారు.

పండ్ల తోటల సాగుపై దృష్టి

కృష్ణగిరి: నీటి సౌకర్యం ఉండి ఐదెకరాల్లోపు పొలం కలిగిన రైతులు పండ్ల తోటల సాగుకు ముందుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. చేసిన పనులకు సంబంధించి మస్టర్లు వెంటనే అప్‌లోడ్ చేసి కూలీల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే వర్షాలు పడుతున్నాయని పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులు, ఈసీ శేషిరెడ్డి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.

మండలానికి చేరిన కానుక

కృష్ణగిరి: 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందించనున్న జగనన్న విద్యాకానుకకు సంబంధించి షూలు బుధవారం మండలానికి వచ్చినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ విజయభాస్కర్ తెలిపారు. మండలంలో ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు అందించేందుకు 7,436 జతల షూలు వచ్చినట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే టెక్స్ట్ పుస్తకాలు, యూనిఫామ్స్ వచ్చాయన్నారు. జూన్ 12న పాఠశాలల ప్రారంభించిన రోజునే విద్యార్థులకు విద్యా కానుక కిట్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వెల్లడించారు.

నూతన భవనాలు.. నిశ్చింతగా విధులు

- రూ.3.6 కోట్లతో 9 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం
- ఇప్పటికే అందుబాటులోకి 4 భవనాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

చిప్పగిరి: గత ప్రభుత్వాల పాలనలో ప్రభుత్వ కార్యాలయాలు అంటే మౌలిక వసతుల లేక, అసౌకర్యాలకు నిలయంగా ఉండువి. వానొస్తే గండం ఉన్నట్లు భావించేవారు. ఎప్పుడు విరిగి మీద పడతాయో అన్న చందంగా ఉండేవి. కార్యాలయంలో బిక్కు బిక్కుమంటూ సిబ్బంది విధులు నిర్వహించాల్సిన దయనీయ పరిస్థితి ఉండేది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గత పాలనకు పూర్తి భిన్నంగా అభివృద్ధే లక్ష్యంగా జనరంజక పాలన సాగిస్తున్నారు. ప్రభుత్వ పాలనలో భాగమైన సిబ్బంది విధులు నిర్వహించేందుకు పక్కా భవనాలు నిర్మిస్తున్నారు. గ్రామస్థాయిలో సచివాలయాలు, ఆర్బీకే కేంద్రాలు, హెల్త్ సెంటర్స్, వేర్ హౌస్ గోదాములు, తదితర భవనాల నిర్మాణం చేపట్టారు. నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. కొన్ని చోట్ల పనులు పూర్తయి భవనాలు అందుబాటులోకి వచ్చాయి. మండలంలో రూ.3.6 కోట్లతో చేపట్టిన 9 గ్రామ సచివాలయాల్లో ఇప్పటికే 4 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశలలో నిర్మాణాలు జరుగుతున్నాయి. సకల సౌకర్యాలతో నూతన భవనాలు అందుబాటులోకి రావడంతో కార్యాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.



దౌల్తాపురంలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం

ప్రజలకు మెరుగైన సేవలు



ప్రభుత్వం నూతన భవనాలు నిర్మించడంతో పాటు సౌకర్యంగా విధులు నిర్వహించేందుకు అవసరమైన కంప్యూటర్లు, ఫర్నీచర్, ఇతర సామగ్రిని కార్యాలయాలలో ప్రతి శాఖకు అందుబాటులోకి తెచ్చింది. సౌకర్యాలన్నీ అందుబాటులో ఉండడంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం.

– సుధీర్, పంచాయతీ కార్యదర్శి, దౌల్తాపురం

సౌకర్యవంతంగా విధులు నిర్వహిస్తున్నాం



గతంలో పాత భవనాలలో మౌలిక వసతులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొంటూ విధులు నిర్వహించే వాళ్లం. ప్రస్తుతం ప్రభుత్వం నిర్మించిన నూతన భవనం అందుబాటులోకి రావడంతో పాటు కార్యాలయ నిర్వహణకు అవసరమైన సౌకర్యాలన్నీ కల్పించారు. సౌకర్యవంతంగా విధులు నిర్వహిస్తున్నాం.

– సాయి అపర్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్, దౌల్తాపురం

‘స్పందన’ అర్జీలను పరిష్కరించండి

నందవరం: స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలని స్పెషల్ ఆఫీసర్ రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఆయన బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పందన అర్జీలు వేగవంతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. అలాగే జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా నమోదైన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. నాడు– నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్రభుత్వ భవన నిర్మాణాల పనుల్లో పురోగతి సాధించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కృష్ణమూర్తి, పీఆర్ ఏఈ జయన్న, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ టౌన్: పేదవారి ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నలుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ.10 లక్షల చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో జి.ఎర్రగుడికి చెందిన షర్ఫున్‌బీకి రూ.6 లక్షలు, కరెంట్ షాక్‌తో చనిపోయిన వైఎస్సార్‌సీపీ నాయకులు సుగాలి రంగడు నాయక్ కుటుంబానికి రూ.2 లక్షలు, వివిధ కారణాలతో మృతి చెందిన సూదేపల్లి లొద్ద రాజ్‌కుమార్ తల్లి సోమేశ్వరమ్మకు రూ.లక్ష, బోగోలు తలారి రాజేష్ సతీమణి శాంతమ్మకు రూ.లక్ష మొత్తం రూ.10 లక్షల చెక్కులను అందజేశారు. ఆరోగ్యశ్రీలో వెయ్యికి పైగా రోగాలను చేర్చి మిగతా రోగాలకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి సహాయం అందిస్తున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగడు, తుగ్గలి మండల కన్వీనర్ జిట్టా నగేష్ ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

చిప్పగిరి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ పీడీ వేణుగోపాల్ గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం మండలంలోని కుందనగుర్తి గ్రామంలోని జగనన్న కాలనీని పరిశీలించారు. అనంతరం చిప్పగిరి గ్రామ సచివాలయంను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 5–18 ఏళ్లలోపు బడిఈడు పిల్లల గుర్తింపు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ సుధాకర్‌రాజు, తహసీల్దార్ లక్ష్మినారాయణ, ఎంఈఓ మస్తాన్ రావు, హౌసింగ్ ఏఈ భవ్య ఏపీఎం నాగార్జున, పంచాయతీ కార్యదర్శి బాలన్న, తదితరులు ఉన్నారు.



కుందనగుర్తిలో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ వేణుగోపాల్

చోరీ సొమ్ములో కొంత రికవరీ

వెల్దుర్తి: గతేడాది ఏప్రిల్ 29న పట్టణంలోని హరిజనవాడ స్కూల్ వెనుక ఇంట్లో పట్టపగలు జరిగిన చోరీకి సంబంధించి కొంత సొమ్మును పోలీసులు రికవరీ చేశారు. ఎస్‌బీఐ ఎదురుగా గల బీసీ పాయింట్ నిర్వాహకురాలు వెంకటేశ్వరమ్మ ఇంట్లో జరిగిన చోరీలో 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.32 వేల నగదు చోరీకి గురైంది. ఇటీవల కర్నూలు పోలీసులు పలు కేసులలోని దొంగలను పట్టుకొని వారి నుంచి సొమ్ము, బంగారు నగలు రికవరీ చేశారు. వాటిలో వెల్దుర్తిలోని వెంకటేశ్వరమ్మకు చెందిన 20 గ్రాముల బంగారు గొలుసు సైతం ఉంది. ఈ గొలుసును బుధవారం వెల్దుర్తి ఏఎస్‌ఐ శివరామిరెడ్డి, హెచ్‌సీ నరసింహులు బాధితురాలు వెంకటేశ్వరమ్మకు అందించారు. విచారణ కొనసాగుతున్నట్లు తెలిపారు.



రికవరీ చేసిన బంగారు గొలుసును బాధితురాలికి అందిస్తున్న పోలీసులు

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ఎమ్మిగనూరు రూరల్: ప్రభుత్వ అనుమతి లేని మిరప విత్తనాలను రైతులకు విక్రయించరాదని ఎమ్మిగనూరు మండల వ్యవసాయ అధికారి మహేశ్వర్ రెడ్డి సీడ్స్ షాపు యజమానులను హెచ్చరించారు. ఆయన బుధవారం పట్టణంలోని భరత్ సీడ్స్ షాపును తనిఖీ చేశారు. షాపులో విక్రయానికి ఉంచిన మిరప విత్తనాలకు సోర్స్ ఆఫ్ సర్టిఫికెట్ లేని కారణంగా వాటిని విక్రయించరాదని యజమానికి స్టాప్ సేల్ నోటీసు అందించినట్లు వెల్లడించారు. రైతులు అనుమతి లేని మిరప విత్తనాలను కొనుగోలు చేయరాదని..విత్తన ఎంపికలో సందేహాలుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

ఎమ్మిగనూరు రూరల్: స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మిగనూరు స్పెషల్ ఆఫీసర్ వెంకట సుబ్బయ్య సూచించారు. ఆయన బుధవా రం ఎమ్మిగనూరులో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై అప్రమత్తంగా ఉండి పరిష్కరించాలన్నారు. సచివాలయాలకు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలన్నారు. పారిశుద్ధ్యలోపం లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్జెక్టుల వారీగా ప్రత్యేక శ్రద్ధ

ఆలూరు: ఇంటర్, పదో తరగతి విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. ఆయన బుధవారం ఆస్పరి కేజీబీవీ పాఠశాలలో రెమిడియల్ తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏపీసీ మాట్లాడుతూ.. జిల్లాలో ఆదోని, గూడూరు, కోడుమూరు, కల్లూరు, ఆస్పరి మండల కేంద్రాలను ఎంపిక చేసి ఒక్కో క్లస్టర్‌లో 7 పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా వారికి అర్థమయ్యేలా బోధిస్తూ నూతనోత్తేజం నింపాలన్నారు. జేసీడీఓ సునీత, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ మారుతి, ఎస్‌ఓలు సునిత, విజయలక్ష్మి, రుక్సాన పర్వీన్, తదితరులు ఉన్నారు.

ఫిల్టర్‌బెడ్ పరిశీలన

ఎమ్మిగనూరుటౌన్: పట్టణానికి మంచినీరు సరఫరా చేసే గుడికల్ రోడ్డులోని పంప్ హౌస్, ఫిల్టర్ బెడ్‌ను బుధవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. నీరు కలుషితం కాకుండా చూడాలని, సక్రమంగా ఫిల్టర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని నీటి సరఫరా విభాగం సిబ్బందికి సూచించారు. డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వెంట ఉన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

నందవరం: ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు 100 శాతం సబ్సిడీ ఇస్తోందని, రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని ఏపీడీ అల్లిపీరా సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు హాలహర్వి, ఇబ్రహీంపురం, పెద్దకొత్తిలి గ్రామాల్లో రైతులు, ఉపాధి కూలీలకు ఉద్యాన పంటలపై డ్వామా అధికారులు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో భాగంగా రైతులకు ప్రభుత్వం నూరు శాతం సబ్సిడీతో మామిడి, జామ, కొబ్బరి, సపోట, నిమ్మ, బత్తాయి, నేరేడు, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, మల్లెలు, గులాబీలు, మునగ మొక్కలు పంపిణీ చేస్తుందన్నారు. మొక్కల పెంపకానికి కూలీలకు మూడేళ్లకు రూ.1,03,193 అందిస్తూ, 238 పని దినాలు కల్పిస్తుందన్నారు. మొక్కల పెంపకానికి కావాల్సిన మందులు, ఎరువులను రాయితీతో అందిస్తుందని వివరించారు. ఏపీఓ మాలిక్‌బాషా, ఈసీ నూర్జహాన్, టీఏ సువర్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసమే యజ్ఞం

మద్దికెర: రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో చేపట్టిన శ్రీలక్ష్మీమహాయజ్ఞాన్ని గురువారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు నిర్వహిస్తున్నారని అందరూ పాల్గొనాలని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో దేవదాయ శాఖ ధర్మదాయ శాఖ నిర్వహించే యజ్ఞానికి సంబంధించి ఆహ్వాన పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు కల్యాణ సౌభాగ్యాల కోసం 108 కుండములతో చతురాగమయుతంగా గావించే మొట్టమొదటి మహాయజ్ఞమన్నారు. పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, మాజీ ఎంపీపీ మల్లికార్జున, ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు రామాంజులు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న జెడ్పీటీసీ

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మిగనూరుటౌన్: ప్రజా సంక్షేమం, అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో కాంతులు విరజిమ్ముతున్నాయని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని 15వ వార్డులో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిలర్ ఇషాక్‌తో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ బుక్‌లెట్ అందించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. పట్టణంలో మంచినీటి సమస్య పరిష్కరించేందుకు ఐఏబీ స్కీం కింద రూ.142 కోట్లతో జీడీపీ నుంచి మంచినీటిని పంపింగ్ చేసేందుకు పనులు వేగవంతం చేసేలా ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. వార్డు పరిధిలో వర్షాకాలంలో డ్రైన్ల సమస్య ఏర్పడుతుందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకురావడంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డీఈ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్ష, కార్యదర్శులు బుట్టారంగయ్య, వీరేంద్ర, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, వక్ఫ్‌బోర్డ్ జిల్లా ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరు 15వ వార్డులో మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

పట్టణాభివృద్ధే లక్ష్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణాభివృద్ధే ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి లక్ష్యమని ఆ మేరకు తగిన ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 28వ వార్డు వెంకటాపురం కాలనీలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వార్డు కౌన్సిలర్ బజారి, కమిషనర్ గంగిరెడ్డితో కలిసి రూ.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ నాయకులు యుకె రాజశేఖర్, రియాజ్‌అహమ్మద్, సునీల్‌కుమార్, వీరేంద్ర పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

వెల్దుర్తి: పొలం తగాదా విషయంలో అన్నపై తమ్ముడు మరో వ్యక్తితో కలిసి దాడికి పాల్పడ్డాడు. బాధితుడు శ్రీను, అతని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కలుగొట్ల గ్రామానికి చెందిన శ్రీను, అతని తమ్ముడు శేఖర్ మధ్య పొలం అమ్మకానికి సంబంధించి తగాదా ఉంది. తమ్ముడి అన్యాయంపై పలు దఫాలు అన్న స్థానిక పోలీసులకు సైతం ఫిర్యాదు చేయడం, పంచాయితీలు జరిగాయి. బుధవారం గ్రామ సెంటర్‌లో శ్రీను ఒంటరిగా వెళ్తుండగా దారికాచిన తమ్ముడు, మరో వ్యక్తి మునిస్వామితో కలిసి దాడికి పాల్పడ్డారు. శ్రీను తలకు బలమైన గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

ఉపాధి కల్పనలో నిర్లక్ష్యం తగదు

హొళగుంద: వలసలను నివారించేలా ఎక్కువ మందికి ఉపాధి పనులు కల్పించి, కూలీల సంఖ్య పెంచాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీఓ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో వ్యవసాయ పనులు లేకపోవడం వల్ల కూలీలకు ఉపాధి పనులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు కల్పించడంలో వెనుకబడిపోతున్నారని, కూలీలను పనులకు రప్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇలాంటి వారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. కూలీల నుంచి ఫిర్యాదులు రాకుండా నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ సాధించడం హర్షణీయం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృత్తి విద్య శిక్షణతో పాటు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడం అభినందనీయమని కళాశాల విద్య కడప ఆర్‌జేడీ డాక్టర్ నాగలింగారెడ్డి పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో డీటీపీ శిక్షణ పూర్తి చేసుకున్న 27 మందికి ఇండివిలేజ్ టెక్ సొల్యూషన్స్ ఎల్‌ఎల్‌పీ, కోజెంట్ టెక్నాలజీ, సువిజన్ హోల్డింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఉద్యోగ నియామక పత్రాలను బుధవారం ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్ స్కిల్స్ నేర్చుకోవడం ద్వారా ఉద్యోగాలు పొందేందుకు సువర్ణావకాశం ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా, జిల్లా ఉపాధి కల్పనా అధికారులు సోమశివారెడ్డి, కృష్ణమోహన్, డీఎస్‌డీఓ శ్రీకాంత్‌రెడ్డి, స్కిల్‌హబ్ కో–ఆర్డినేటర్ సుధాకర్ బాబు ఉన్నారు.

ఘనంగా మారెమ్మ దేవర

గోనెగండ్ల: మండల పరిధిలోని ఒంటెడుదిన్నె గ్రామంలో మారెమ్మ దేవర బుధవారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం పూర్ణకుంభాలు, మేళ తాళలతో ఊరేగింపుగా వచ్చి బలిదానం కానిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు వారికి ఘన స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. సర్పంచ్ కేశవ రెడ్డి, అలువాల ప్రమోద్‌కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తతో మాట్లాడుతున్న ఎర్రకోట జగన్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

బాధ్యతగా పనిచేయండి

గోనెగండ్ల: గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ వరలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని పుట్టపాశం గ్రామ సచివాలయంను ఆమె తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు శాతాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయంలో అందిస్తున్న సేవల గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఏయే సేవలపై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సచివాలయంలో అందించే పలు రకాల సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన వారికీ సంక్షేమ పథకాలు అందించాలని సూచించారు. అలాగే సమయపాలన పాటించి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. ఏఓ రాజాకిషోర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పుట్టపాశం సచివాలయంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జేడీ వరలక్ష్మి

భక్తిశ్రద్ధలతో లక్ష్మమ్మవ్వ ఆరాధనోత్సవాలు

నందవరం: కనకవీడు గ్రామంలో మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు బుధవారం ఉదయం గణపతి పూజ, కలశ స్థాపన, పంచామృతాభిషేకం, సాయంత్రం అంకుర్పారన, అమ్మవారికి భక్తులు, భక్త బృందం విశిష్ట పూజలు గావించి కుంకుమార్చన, మహా మంగళహారతులు చేపట్టారు. 11న ప్రత్యేక పూజలు, 12న అభిషేకం, ప్రభకు పూజలు, బలిదానం , పూర్ణాహుతి గావించి సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు వివరించారు.

ఆలూరు: మూసానపల్లి గ్రామంలో లక్ష్మమ్మవ్వ జాతర సందర్భంగా బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తిని ప్రభపై ఉంచి మేళతాళాల నడుమ ఎదురు బసవన్న దేవాలయం వరకు లాగారు. ఆలయ అర్చకులు శివశంకరయ్య స్వామి గంగ, ఆకుపూజ, కుంకమార్చన, ఫల, పుష్ప, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

సత్తాచాటిన పెద్దనేలటూరు వృషభాలు

తుగ్గలి: వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పగిడిరాయిలో నిర్వహించిన వృషభాల రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. గ్రామ పెద్దలు జగన్నాథరెడ్డి, ఈశ్వరరెడ్డి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో పెద్దనేలటూరు సుంకన్న, సీతారాముడు వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో అనంతపురం జిల్లా చాగల్లు ఆదినారాయణ వృషభాలు, కర్నూలు జిల్లా ఎస్‌ఎస్‌వీ సైడర్ మున్న మలేలా వృషభాలు, నంద్యాల జిల్లా పోదొడ్డి రంగారెడ్డియాదవ్ వృషభాలు, డి రంగాపురం రామచంద్రారెడ్డి, జేసీబీ సాయి వృషభాలు నిలిచాయి. గెలుపొందిన వృషభ యజమానులకు గ్రామ వాల్మీకి సంఘం వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు అందజేశారు. వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ

వెల్దుర్తి: స్పందన అర్జీల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, సమస్యలను పరిష్కరించేలా సేవలందించాలని కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్ మండల రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్వరి, మండల సర్వేయర్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఆర్ఐ అబ్దుల్ కలాం, వీఆర్‌ఓలతో సమావేశమయ్యారు. మండల పరిధిలో జరుగుతున్న భూముల రీసర్వే వివరాలు తెలుసుకున్నారు. వేగవంతంగా, సమస్యలు రాకుండా సర్వే నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి సచివాలయంలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు.